సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 24.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 263
పేజీలు: 08 వెల: రూ. 5

## పేపర్‌లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

**యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని వదలం** 02




- రాహుల్ మూడు డిమాండ్లు..
- సీజేపీ ఆందోళనలు కొనసాగింపు
- 16 మెట్రో స్టేషన్లు మూసివేత

# డేంజర్ జోన్‌లో తెలంగాణ

## ఎల్‌నినో ఎఫెక్ట్‌తో జలసంక్షోభం!

## భూగర్భజలాలు పడిపోయి.. 'నీటి కటకటలో' రాష్ట్రం

- ప్రాజెక్టులు వెలవెల.. తాగునీటి ముప్పు!
- కృష్ణా-గోదావరిలో ఆందోళనకర నిల్వలు!
- వానలు లేక.. నీటి ఎద్దడి తీవ్రం!
- రైతులకు సాగునీటి కష్టాలు!
- జలాశయాలు అడుగంటుతున్నాయి!
- హైదరాబాద్‌కూ నీటి కష్టాల హెచ్చరిక!
- వర్షాభావంతో తెలంగాణ విలవిల!
- నీటి కొరతపై నిపుణుల హెచ్చరిక!



**ముద్ర డెస్క్:** వర్షాభావ పరిస్థితులకు తోడు పసిఫిక్ మహాసముద్రంలో 'ఎల్‌నినో' రాక్షసి విరుచుకుపడుతోంది. ఫలితంగా రాష్ట్రంలో నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఓవైపు తాగునీటి ఎద్దడి గుమ్మం ముందుకు వచ్చి నిలబడితే, మరోవైపు వానాకాలం పంటలు ఎలా సాగు చేయాలనే వేదన రైతాంగాన్ని వెంటాడుతోంది. రాష్ట్రానికి జీవధారలైన కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాలు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో ఇన్-ఫ్లోలు రాకపోవడంతో ప్రాజెక్టులు ఎండిపోయి, డెడ్ స్టోరేజీకి చేరువవుతున్నాయి.

**తుప్పర్ల జల్లుమాత్రమే..**

ఆకాశం వైపు కళ్లు కాయలు కాచేలా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎల్ నినో ప్రభావంతోభారీ వర్షాలు కురువడం లేదు. తుప్పర్ల జల్లుమాత్రమే కురుస్తుంది. ఫలితంగా రాష్ట్రంలోని ఎగువ, దిగువ జలాశయాలన్నీ అడుగంటిపోయి, ఊళ్లు-పట్నం తేడా లేకుండా జలగండం విరుచుకుపడుతోంది. ఓవైపు సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను చూసి గుండెకోతతో రైతన్నలు రోడ్డెక్కుతుంటే.. మరోవైపు మహానగరం హైదరాబాద్‌తో సహా పలు పట్టణాల్లో గుక్కెడు తాగునీటి కోసం ట్యాంకర్ల ముందు జనం క్యూ కడుతున్నారు. ముున్ముందు ఈ నీటి ఎద్దడి ఎంతటి తీవ్రరూపం దాలుస్తుందోనన్న భయం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది.

**ఏ బేసిన్ చూసినా ఆందోళనే..**

ఉత్తర తెలంగాణాకు ప్రధాన వనరైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 17.79 టీఎంసీలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆయకట్టుకు నీరందించడం ప్రాజెక్ట్ అధికారులకు పెను సవాలుగా మారింది. నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.8 టీఎంసీలకు గాను 6.44 టీఎంసీలు, ఇక రాజధాని హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చే సింగూరులో 4.28 టీఎంసీలే మిగిలాయి. అప్పర్ మానేరు 0.60 టీఎంసీలతో దాదాపు ఎండిపోయిన స్థితికి చేరింది. ఎల్లంపల్లిలో సైతం 7.83 టీఎంసీల నీరు, లోయర్ మానేరులో 24.03 టీఎంసీలకు గాను 5.55 టీఎంసీలు, సింగూరు ప్రాజెక్టులో 29.92 టీఎంసీలకు గాను కేవలం 4.28 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ప్రాజెక్టులోని నీరు మిగలడం వర్షాభావ తీవ్రతకు నిదర్శనం. మిగతా 02లో

- వార్డుల పునర్విభజన పూర్తయ్యే వరకు ఎన్నికల నోటిఫికేషన్‌కు స్టే
- శాస్త్రీయ డీలిమిటేషన్ లేకుండా ఎన్నికలు నిర్వహించొద్దు
- రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- అధికార కాంగ్రెస్‌కు రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ
- ప్రతిపక్షాలకు దొరికిన బలమైన అస్త్రం

# గ్రేటర్ ఎన్నికలు లేనట్లే?

## హైకోర్టు స్టేతో జీహెచ్ఎంసీ ఎన్నికలకు బ్రేక్..!



**హైదరాబాద్, ముద్ర ప్రతినిధి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల సన్నాహాల్లో ఉన్న ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక షాక్ ఇచ్చింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధంగా, శాస్త్రీయ ప్రాతిపదికన పూర్తి చేసే వరకు జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయరాదంటూ హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లకుండా ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ఆదేశించింది. వార్డుల సరిహద్దుల నిర్ణయంలో తెలంగాణ మున్సిపాలిటీల చట్టం–2019లోని నిబంధనలను పాటించలేదని, జనాభా సమతుల్యతను విస్మరించి పునర్విభజన చేపట్టారని పిటిషనర్లు చేసిన వాదనలపై ప్రాథమికంగా సంతృప్తి చెందిన న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ, శాస్త్రీయ సర్వేలు, చట్టపరమైన విధివిధానాలు పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేయాలని స్పష్టం చేసింది.

**డీలిమిటేషన్‌పై తీవ్ర అభ్యంతరాలు**

ప్రతి వార్డు జనాభా సమతుల్యత ఆధారంగా సరిహద్దులు నిర్ణయించాల్సి ఉండగా, కొన్ని వార్డుల్లో అధిక జనాభా, మరికొన్నింటిలో తక్కువ జనాభాతో విభజన జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ జరిగిందని ఆధారాలున్నట్లు ధర్మాసనం భావించింది. మిగతా 04లో

## మున్సిపల్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

### భూ సేకరణ తర్వాతే టెండర్లు

- మూడు కమిషనరేట్ల పనులపై సమీక్ష
- మన్మోహన్ సింగ్ విగ్రహ పనులు వేగంగా పూర్తి చేయాలి
- భవన నమూనాలపై సీఎం రేవంత్ రెడ్డి సూచనలు

02



## నా చావుకు ప్రధానియే కారణం

**ఎస్ఐఆర్ ఫాంపై సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య** 02

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం
- ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిన పోలీసులు.
- వంశీ మృతితో రాచర్ల గొల్లపల్లి గ్రామంలో విషాదం..



## అమెరికాపై 9/11 తరహా దాడులు

**హార్ముజ్ ఉద్రిక్తతల నేపథ్యంలో పరస్పర బెదిరింపులు..** 02

- ఇరాన్ సంచలన వార్నింగ్
- అమెరికా–ఇరాన్ మధ్య మాటల యుద్ధం
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు
- ప్రపంచం ఆందోళన
- అమెరికా అప్రమత్తం



## రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు

**గ్లోబరీనా వివాదంలో సీఐడీ విచారణకు సిద్ధమా అంటూ సవాల్** 02

- మోడీ పేరును ప్రస్తావించడానికి రేవంత్ కు భయం
- రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా నా?
- సీఎంపై నిప్పులు చెరిగిన కేటీఆర్



## 3,168 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

### ఖాళీల భర్తీ, చేనేతలకు ₹25 వేల భరోసా

- ఉపాధి, సంక్షేమానికి పెద్దపీట..
- ఉద్యోగాలు, పుష్కరాలు, రైతులు, దివ్యాంగులపై కీలక నిర్ణయాలు.
- ఉద్యోగాలు, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ఆమోదం.
- ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయాలు..

02



## యువత గొంతు నొక్కితే.. రాజకీయ పతనం

**ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరు.. రాజ్యాంగాన్ని అణచలేరు**

- దేశ యువత ఆశలకు ప్రతీక రాహుల్ గాంధీ
- 2029లో దేశానికి ప్రత్యామ్నాయ నాయకత్వం కాంగ్రెస్‌దే
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



**ఇదీ AI ముద్ర**

ఉత్తర్‌ప్రదేశ్‌లో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ముగ్గురు అక్కాచెల్లెళ్లు వారి రీల్స్ తీసే కెమెరామెన్‌నే పెళ్లి చేసుకోవడం చూసి అందరూ ముక్కున వేలేసుకున్నారు.






సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 24.07.2026
www.mudranews.in | @mudranews



## ఉసిరికాయలో యాంటీ ఆక్సిడెంట్లు



ఉసిరికాయలో ఉండే విటమిన్ c, పాలీఫినాల్స్ శరీరంలో గ్లూకోజ్ మెటాబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. భోజనం తర్వాత రక్తంలో షుగర్ ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

# డేంజర్ జోన్‌లో తెలంగాణ

(మొదటగి పేజీ తరువాయి)

**ఐదుబ్యారేజీల్లో సున్నా..**
గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఐదు బ్యారేజీల్లో సున్నా టీఎంసీలు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. పార్వతీ బ్యారేజీలో 8.83 టీఎంసీలకు గాను నీటి నిల్వలేదని, సరస్వతీ బ్యారేజీలోనూ 10.87 టీఎంసీలకు సున్నా టీఎంసీలు స్టోరేజీ ఉందని అధికారులు పేర్కొంటున్నారు. లక్ష్మీ బ్యారేజీలో 16.17 టీఎంసీలు, సమ్మక్క బ్యారేజీ 6.94 టీఎంసీలు, సీతమ్మసాగర్ బ్యారేజీ 36.57 టీఎంసీలకు గాను సున్నా టీఎంసీలు గా నిల్వ ఉన్నాయి.

**కృష్ణా బేసిన్ వెలవెల..**
తెలంగాణ రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైన శ్రీశైలంప్రాజెక్టు పూర్తి నీటిమట్టం215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నిల్వలు 41.45 టీఎంసీలకు పడిపోయాయి. ఇటు నాగార్జునసాగర్‌లో 315.05 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 137.51 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆల్మటిలో 129.72 టీఎంసీలకు గాను 101.19, నారాయణపూర్ రిజర్వాయర్ లో 37.64 టీఎంసీలకు 24.67 టీఎంసీలు, తుంగభద్రలో 105.79 టీఎంసీలకు గాను 25.8 టీఎంసీలు మాత్రమే ఉంది. ఎగువ నుంచి ఆశించిన మేర వరద రాకపోతే కృష్ణా డెల్టా పరిధిలో పంటల సాగు ప్రమాదంలో పడింది.

**ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు..**
ఈ ఏడాది నమోదైన వర్షాభావ పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావమే ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రుతుపవనాల రాక మందగించడం, ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడంతో జలాశయాల్లో ఆవిరి శాతం కూడా పెరిగింది. పర్యవసానంగా ప్రాజెక్టుల నీటి మట్టాలు నానాటికీ అడుగంటిపోతున్నాయి. కొన్ని జిల్లాల్లో 10 నుంచి 12 మీటర్ల లోతునకు జలాలు పోతున్నాయి. రాజధాని హైదరాబాద్‌లో తాగునీటి తిప్పలు వర్ణనాతీతంగా మారాయి. సింగూరు, మంజీర, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోతుండటంతో ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది.

**తక్షణ కార్యాచరణ అవసరం**
ప్రాజెక్టుల్లో ఉన్న అరకొర నీటిని సాగునీటి కాలువలకు మళ్లించకుండా, కేవలం తాగునీటి అవసరాలకే నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత నీటి లభ్యతను బట్టి ఏ పంటలు వేయాలో రైతాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.రాబోయే రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ట్యాంకర్లు, బోర్‌వెల్ల పునరుద్ధరణ వంటి చర్యలపై ఇప్పటినుంచే దృష్టి సారించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.



# పేపర్‌లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

## యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని వదలం

**ముద్ర, న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతమవుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ కీలక ప్రకటన చేశారు. పరీక్ష పత్రాల లీకేజీ కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.
నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ప్రారంభమైన ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. విద్యార్థి సంఘాలు, సీజేపీ చేపట్టిన నిరసనలకు కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపడంతో ఈ అంశం రాజకీయంగా మరింత వేడెక్కింది. ఇదే అంశంపై పార్లమెంట్‌లోనూ వరుసగా వాయిదాలు పడుతూ కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.
ఈ పరిణామాల మధ్య గురువారం ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, పరీక్షల పారదర్శకతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. "విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత. పేపర్ లీక్‌లకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే. కేసుల విచారణ ఆలస్యం కాకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు అవసరమైన చర్యలను అధికారులు వెంటనే చేపడతారు" అని పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ ఘాటు స్పందన**
ప్రధాని ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. యువత భవిష్యత్తును దెబ్బతీసింది కేంద్ర ప్రభుత్వమేనని ఆరోపించారు. విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతున్నా ప్రభుత్వం బాధ్యులను రక్షిస్తోందని విమర్శించారు. విద్యార్థుల తరఫున మూడు ప్రధాన డిమాండ్లను ఆయన మరోసారి ప్రస్తావించారు.
★కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలి.
★దేశవ్యాప్తంగా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలి.
★నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**సీజేపీ డిమాండ్ యథాతథం**
ప్రధాని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటనను స్వాగతించినప్పటికీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం వెనక్కి తగ్గేది లేదని సీజేపీ స్పష్టం చేసింది. పేపర్ లీక్‌కు రాజకీయ, పరిపాలనా బాధ్యతను మంత్రి వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది.

**ఢిల్లీలో హై అలర్ట్**
ఆందోళనలు మరింత విస్తరించే అవకాశం ఉండటంతో ఢిల్లీలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. జంతర్ మంతర్, పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజల రాకపోకలు, నిరసనల దృష్ట్యా గురువారం నగరంలోని 16 మెట్రో స్టేషన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలు చేశారు.

**దేశవ్యాప్తంగా చర్చనీయాంశం**
నీట్ పేపర్ లీక్ వివాదం ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ప్రభుత్వం కఠిన చర్యలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను శిక్షిస్తామని చెబుతుండగా, మరోవైపు విపక్షాలు మంత్రి రాజీనామా, బాధ్యులపై తక్షణ చర్యల కోసం ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో ఈ అంశం పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నా చావుకు మోదీయే కారణం

**ముద్ర, కరీంనగర్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్న ఓ విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతను ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని మిగిల్చింది. అయితే, ఈ ఘటనలో అత్యంత సంచలనంగా మారిన అంశం అతను ఆత్మహత్యకు ముందు రాసి ఉంచినట్లు గుర్తించిన సూసైడ్ నోట్.
పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. వంశీ తన చేతిరాతతో 'ఎస్.ఐఆర్' ఫాంపై "నా చావుకు కేవలం ప్రధాని నరేంద్ర మోదీయే కారణం. ఎవరినీ ఏమీ అనొద్దు" అని రాసి ఉంచినట్లు గుర్తించారు. ఈ సూసైడ్ నోట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ నోట్‌లో పేర్కొన్న వ్యాఖ్యలు మాత్రమే ప్రస్తుతం బయటకు వచ్చిన సమాచారం. వాటి వెనుక ఉన్న వాస్తవ పరిస్థితులు, కారణాలు ఏమిటన్నది అధికారికంగా నిర్ధారణ కాలేదు.
ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూసైడ్ నోట్‌ను కూడా స్వాధీనం చేసుకున్న అధికారులు దానిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించడంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
వంశీ ఆత్మహత్యకు దారితీసిన అసలు కారణాలపై ప్రస్తుతం అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అతను నోట్‌లో ప్రధాని పేరును ఎందుకు ప్రస్తావించాడు? వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నాయా? మానసిక ఒత్తిడి, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర కారణాలు ఏమైనా ఈ ఘటనకు దారితీశాయా? అనే అంశాలపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ధారణకు రావడం సరికాదని అధికారులు సూచిస్తున్నారు.
ఈ ఘటనతో రాచర్ల గొల్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వంశీ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామస్తులు కూడా ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. యువకుడి ఆకస్మిక మరణం గ్రామంలో విషాద వాతావరణాన్ని నెలకొల్పింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సూసైడ్ నోట్‌కు సంబంధించిన సమాచారం వేగంగా వైరల్ అవుతున్నప్పటికీ దర్యాప్తు పూర్తికాకముందే వివిధ రకాల ఊహాగానాలు చేయడం లేదా వ్యక్తిగత అభిప్రాయాలను వాస్తవాలుగా ప్రచారం చేయడం తగదని నిపుణులు సూచిస్తున్నారు. సూసైడ్ నోట్‌లోని వ్యాఖ్యలు దర్యాప్తులో భాగంగా పరిశీలించాల్సిన అంశాలు మాత్రమే. అవి తుది దర్యాప్తు నిర్ధారణగా లేదా అధికారిక వాస్తవాలుగా పరిగణించరాదు.
పోలీసులు ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదికలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే ఆత్మహత్య వెనుక ఉన్న అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
ఈ ఘటనకు సంబంధించి ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సూసైడ్ నోట్‌లో ఉన్న వ్యాఖ్యలు మృతుడు రాసినట్లుగా స్వాధీనం చేసుకున్న సమాచారం మాత్రమే. అవి అధికారికంగా నిర్ధారించబడిన వాస్తవాలు లేదా తుది దర్యాప్తు నివేదికగా పరిగణించరాదు.

# మున్సిపల్ అభివృద్ధి పనుల వేగం పెంచండి

**ముద్ర, హైదరాబాద్:** ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో గురువారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ జి సృజన, ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎంఆర్డీసీఎల్ ఎండీ నరసింహారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ పూర్తి కాకముందే టెండర్లు పిలవొద్దని స్పష్టం చేసిన ఆయన, భూ సేకరణ కోసం ప్రత్యేక అధికారిని ఇప్పటికే నియమించినట్లు తెలిపారు.
అలాగే జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో అభివృద్ధి పనుల అనుమతులకు సంబంధించిన అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.
సైబరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహం, జంక్షన్ అభివృద్ధి పనులను హెచ్ఎండీఏ వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (NIUM) భవనం, మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నమూనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు, సూచనలు చేశారు.

# రేవంత్‌కు లీగల్ నోటీస్

**ముద్ర, హైదరాబాద్:** గ్లోబరీనా సంస్థ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని, ఆ సంస్థ తన బినామీ సంస్థ అని ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రికి ఇప్పటికే లీగల్ నోటీసులు పంపించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తనపై చేసిన చేసిన ఆరోపణలను రుజువు చేయాలని లేదంటే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయంలో తాను లై డిటెక్టర్ పరీక్షతో పాటు సీఐడీకి విచారణకు సిద్ధమని మరి రేవంత్ రెడ్డి తన కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడి విచారణకు సిద్ధమా? అని ప్రశ్నించారు. గ్లోబరీనా సంస్థ నిజంగానే నా బినామీ సంస్థే అయితే అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని కేటీఆర్ ప్రశ్నించారు. మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఇవాళ వరంగల్ పర్యటన సందర్భంగా మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాట్లాడారు.
కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన సీఎం ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోడీ పేరును ప్రస్తావించరని, రేవంత్ రెడ్డి మోడీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమేనన్నారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటారని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని, కాంగ్రెస్‌కు ఒకటి, బీజేపీకి రెండు మూటలు ఇదే రేవంత్ రెడ్డి పాలన అన్నారు. ఒకవైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు




# 3,168 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

**ముద్ర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక కీలక, నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా దాదాపు 25కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చలు జరిగాయి. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో యువత, చేనేత కార్మికులు, దివ్యాంగులు, వ్యవసాయ రంగానికి లబ్ధి చేకూర్చే పరిపాలనాపరమైన అనుమతులకు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన నిర్ణయం నిరుద్యోగులకు సంబంధించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3,168 ప్రభుత్వ ఉద్యోగాలను ఏపీపీఎస్సీ, ఇతర రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా భర్తీ చేసే ప్రతిపాదనకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో నోటిఫికేషన్ల విడుదలకు మార్గం సుగమమైంది. దీనితో పాటు చేనేత కార్మికుల ఆర్థిక సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నేతన్న భరోసా పథకం కింద అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా 25,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయం పట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

**పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లకు నిధులు**
రాష్ట్రంలో మౌలిక వసతులు, మౌలిక ప్రాజెక్టుల పురోగతిపై కేబినెట్ లోతుగా చర్చించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల వేగం, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అలాగే రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, సురక్షితంగా నిర్వహించేందుకు భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం 50 కోట్ల నిధులను మంజూరు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనితో పాటు రైతాంగానికి మద్దతుగా ఏపీ మార్క్‌ఫెడ్ సేకరించే 300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని నిశ్చయించింది.

**ప్రత్యేక డిగ్రీకాలేజీ**
సామాజిక బాధ్యత, దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా కేబినెట్ మరో అరుదైన నిర్ణయం తీసుకుంది. బాపట్లలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అత్యవసర సేవల సమర్థతను పెంచేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి అగ్నిమాపక శాఖకు నూతన వాహనాలు, ఆధునిక యంత్ర పరికరాలు సమకూర్చాలని తీర్మానించారు. విశాఖపట్నంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎండాడ వద్ద ఏఐజీ ఆసుపత్రులకు భూ కేటాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందని సమాచారం.
రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపైనా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల ఎదురవుతున్న దుర్భిక్ష పరిణామాలను గమనిస్తూ, రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధి, నూతన పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలమైన విధానాలను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. పొగాకు రైతులకుసాయం చేయడానికి మూడు అంశాలపై మంత్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

# అమెరికాపై 9/11 తరహా దాడులు

**ముద్ర డెస్క్:**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్– అమెరికా మధ్య పరస్పర దాడులు ఉద్ధృతంగా జరుగుతూనే ఉన్నాయి. ఇరాన్ లోని బ్రిడ్జ్ లు, విద్యుత్, అణు స్థావరాలపై దాడులు చేస్తామని తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దాంతో ఇరాన్ కు చెందిన ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ ట్రంప్ వ్యాఖ్యలకు ఘాటుగా బదులిచ్చింది. అమెరికాపై 9/11 తరహా దాడులు చేస్తామని గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఆ దాడులకు అమెరికా మొత్తం శోక సంద్రంలో మునిగిపోతుందని స్పష్టం చేసింది. అమెరికా– ఇరాన్ ఇలా వరుసగా వార్నింగ్ లు జారీ చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ లోని స్టేట్ న్యూస్ ఏజెన్సీ అయిన తస్నిమ్ అందించిన సమాచారం ప్రకారం.. ట్రంప్ వార్నింగ్ కు IRGC స్పందిస్తూ.. ఒకవేళ యుద్ధం కొనసాగితే మీరు పశ్చాత్తాపం పడే విధంగా మా దాడులు ఉంటాయి. అమెరికా మొత్తం శోక సంద్రంలో మునిగిపోతుంది. అమెరికాపై 9/11 దాడులు చేస్తాం" అని స్పష్టం చేసింది. గతంలో సెప్టెంబర్ 11 న అమెరికాలో అల్–ఖైదా ఉగ్రవాదులు మారణ హోమం సృష్టించారు. నాలుగు విమానాలను హైజాక్ చేసి అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఏకంగా 3 వేల మందికిపైగా మృతి చెందారు. బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్–ఖైదా ఉగ్రవాద సంస్థ ఈ దాడులు నిర్వహించింది. ఆ సమయంలో అమెరికా మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. అయితే తాజాగా ఇరాన్ ఈ ఘటనను గుర్తు చేస్తూ అమెరికాలో ఇలాంటి దాడులు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేసింది.
అంతకుముందు ఇరాన్ కు ట్రంప్ సంచలన వార్నింగ్ ఇచ్చారు. హోర్మ్యూజ్ జల సంధిలో నౌకలపై ఇరాన్ సైన్యం దాడులకు పాల్పడితే అమెరికా తక్షణమే ఇరాన్ పై దాడులు చేస్తుందని అన్నారు. హోర్మ్యూజ్ లోని వాణిజ్య నౌకలపై జరిగే ఒక్కో దాడికి ప్రతీకారంగా ఇరాన్ లోని ఒక్కో న్యూక్లియర్ ప్లాంట్, బ్రిడ్జ్ లను ధ్వంసం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ ను ఇప్పట్లో వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ కు ఇరాన్ సైన్యం ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం తీవ్రస్థాయిలో యుద్ధ వాతావరణం నెలకొంది.



**భోజనం తర్వాత షుగర్ స్పైక్ తగ్గించడంలో ఉసిరి సహాయం**



న్యూట్రాస్యూటికల్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, ఉసిరికాయను తీసుకోవడం వల్ల పోస్ట్‌ప్రాండియల్ (భోజనం తర్వాత) బ్లడ్ షుగర్ స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

## చారిత్రక శాసనసభ భవన మరమ్మతుల పరిశీలన



**ముద్ర, హైదరాబాద్ :** చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. భవనం ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మీడియా తీరుపై ప్రియాంక ఫైర్

**- ప్రభుత్వాన్ని నిలదీయండి.. ప్రతిపక్షాన్ని కాదు**



**ముద్ర, న్యూఢిల్లీ:** ఢిల్లీలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళన, వారికి మద్దతుగా ప్రతిపక్షాల నిరసనల కవరేజ్ పై మీడియా అనుసరిస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీ తీవ్రంగా విమర్శించారు. గురువారం మధ్యాహ్నం ఆమె పార్లమెంట్ నుంచి వెలుపలికి వస్తుండగా మీడియా ప్రతినిధులు ఏం జరుగుతోందని ప్రశ్నించినప్పుడు ఆమె వారిపై విరుచుకుపడ్డారు. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, పార్లమెంట్ ఎందుకు నడవడం లేదని ప్రతిపక్షాన్ని కాకుండా ప్రభుత్వాన్ని నిలదీయాలని మీడియాకు సూచించారు. ఎప్పుడు రాజీనామా చేస్తారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను అడగాలని, అలాగే విద్యార్థులపై లాఠీచార్జ్ ఎందుకు జరిగిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రశ్నించాలని అన్నారు. ఇంటర్నెట్ సేవలు ఎందుకు నిలిపివేశారని, విద్యార్థులపై ఎన్ఎస్ఏ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నిస్తూ, విద్యార్థులను ఉగ్రవాదులుగా చూస్తున్నారా అని ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఆందోళనకారుల పాస్‌పోర్టులు రద్దు!

**ఢిల్లీ ఆందోళనల్లో పోలీసుల కఠిన నిర్ణయం**



**ముద్ర, న్యూఢిల్లీ :** చలో పార్లమెంట్ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నిరసనల్లో పాల్గొన్న వారిని గుర్తించి, వారి పాస్‌పోర్టులు కూడా రద్దు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంట్ సోమవారం ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను ధ్వంసం చేసి, విద్యార్థులు, సీజేపీ నేతలు నిరసనలు చేపట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతోపాటు, లాఠీ ఛార్జ్ చేశారు. ఈ క్రమంలో పలువురు ఆందోళనకారులు, పోలీసులకు కూడా గాయాలయ్యాయి.

**24న దేశవ్యాప్త నిరసనలకు పిలుపు**

ఆందోళనపై పోలీసుల తీరును నిరసిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేపడుతున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ నిరసనకు మద్దతివ్వాలని విద్యార్థి సంఘాలను కోరింది. ఈ క్రమంలో విద్యా సంస్థలు మూతపడనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక విద్యార్థి నేతలు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థి సంఘాలు కోరాయి.

## ఎల్‌నినో ప్రభావం: ముందస్తు చర్యలు చేపట్టాలి

**ప్రజలకు ఇబ్బందులు పడకుండా కార్యాచరణ చేపట్టాలి..**
**రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
**హుస్నాబాద్‌లో మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష...**
**తాగునీరు, ఆరుతడి పంటలు, పశుగ్రాసం, భూగర్భ జలాల సంరక్షణపై మంత్రి కీలక ఆదేశాలు**

**ముద్ర, హుస్నాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్‌లో కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సంరక్షణ, ఆరుతడి పంటల ప్రోత్సాహం, పశుగ్రాసం అందుబాటు, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమస్యలు వచ్చిన తర్వాత కాకుండా ముందుగానే కార్యాచరణ అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.




# యువత గొంతు నొక్కితే... బీజేపీ రాజకీయ పతనం తప్పదు

**- ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరు...**
**- రాజ్యాంగాన్ని అణచలేరు**
**- దేశ యువత ఆశలకు ప్రతీక రాహుల్ గాంధీ**
**- 2029లో దేశానికి ప్రత్యామ్నాయ నాయకత్వం కాంగ్రెస్‌దే**
**- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్ :** విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారి గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగాలు, పరీక్షల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోరుతున్న యువతపై లాఠీచార్జీలు, నిర్బంధాలు, బెదిరింపులు చేయడం బీజేపీ పాలనకు నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అణచివేయడమే ప్రజాస్వామ్యానికి అసలైన ముప్పని పేర్కొన్నారు.



విద్యార్థుల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడిగా నిలిచారని ఉత్తమ్ కొనియాడారు. అసత్య ప్రచారాలు, విద్వేష రాజకీయాలు, దర్యాప్తు సంస్థల భయంతో ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచివేయలేరని హెచ్చరించారు.

భారత రాజ్యాంగం కల్పించిన ప్రశ్నించే హక్కును కాపాడటం కాంగ్రెస్ బాధ్యత అని పేర్కొన్న ఆయన, దేశ యువత విద్వేషాన్ని కాకుండా విశ్వాసాన్ని, ప్రచారాన్ని కాకుండా పారదర్శక పాలనను కోరుకుంటోందన్నారు.

2029 లోక్‌సభ ఎన్నికలు కేవలం అధికార మార్పు కోసం కాకుండా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, యువత భవిష్యత్తును కాపాడే ఎన్నికలుగా నిలుస్తాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ దేశానికి ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందని, ప్రజల ఆశీర్వాదంతో 2029లో ఆయన ప్రధానమంత్రి అవుతారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తోందని పేర్కొన్న ఉత్తమ్, ప్రజల గొంతును వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయని, ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూసే ప్రభుత్వాలకు ప్రజలే తగిన తీర్పు ఇస్తారని వ్యాఖ్యానించారు.

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**ముద్ర, కోరుట్ల;** ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ (వాటర్ గ్రిడ్) కేంద్రాన్ని గురువారం రోజు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ గ్రిడ్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి సరఫరా తీరును, ట్యాంకులను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ నీరు కొద్దిగా రంగు మారి వస్తున్నట్లు గమనించిన చైర్మన్, నీటి నాణ్యత విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు. 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, 22వ వార్డు కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మున్సిపల్ డీఈ నాగేశ్వరరావు, భగీరథ విభాగానికి చెందిన డీఈ, ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై దమనకాండకు నిరసన..

**ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీల్లో తెలంగాణ రక్షణ సేన విద్యార్థుల నిరాహార దీక్ష**

**ముద్ర, హైదరాబాద్ / కరీంనగర్:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకులు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ, కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీల్లో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేసి విద్యార్థి నాయకులను వర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, శాతవాహన యూనివర్సిటీలో దీక్ష కొనసాగుతోంది.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట రాము యాదవ్, నవీన్ గౌడ్, రవి రాథోడ్, అజయ్, రాజ్‌కుమార్, దీపక్, శేఖర్ తదితరులు నిరాహార దీక్ష ప్రారంభించారు. క్యాంపస్‌లో దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి వర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా వారు తమ నిరాహార దీక్షను కొనసాగించారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థులకు న్యాయం చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై దమనకాండకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇదే సమయంలో కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో చెన్నమల్ల చైతన్య, బండ అశోక్, ఉట్కూరి అనూప్ రెడ్డి, సడిగే రాజశేఖర్, షేక్ తాజ్ బాబా తదితరులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని వారు డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి యూపీఎస్సీ తరహా స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దక్షిణాది రాష్ట్రాల డిమాండ్ మేరకు రాష్ట్రాల వారీగా మెడికల్ ప్రవేశ పరీక్షలు నిర్వహించే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించే వరకు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తామని తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకులు స్పష్టం చేశారు.

# అమరావతిలో పీఎన్ బీ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

**రాష్ట్ర ప్రభుత్వం- పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఎంఓయూ**
**సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం**

**ముద్ర, అమరావతి :** అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఏపీ క్వాంటం మిషన్-పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు- పీఎన్ బీ సీఈఓ, ఎండీ అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్ గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్ లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది.



**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్ బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు- బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ బీ ఉన్నతాధికారులు, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

**భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి**
**భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్**
**ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ**
**మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



**ముద్ర, అమరావతి :** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ రికార్డులకు అత్యంత భద్రత కల్పించే 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును గురువారం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. బ్లాక్‌చెయిన్ సాంకేతికత ద్వారా ప్రతి భూమికి ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇవ్వడంతో పాటు భూ రికార్డులను ట్యాంపర్ చేయలేని విధంగా భద్రపరుస్తామని తెలిపారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ రికార్డులకు అడ్డుకట్ట వేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని 89 రీ-సర్వే గ్రామాల్లో ఈ పైలెట్ అమలు చేయనున్నారు. మొత్తం 1.37 లక్షలకు పైగా ల్యాండ్ పార్సెల్‌లను ఇందులో చేర్చుతున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గతంలో భూ రికార్డుల లోపాల కారణంగా అనేక వివాదాలు, మోసాలు జరిగాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల ప్రక్షాళన కొనసాగుతోందని, సర్వే పూర్తైన గ్రామాలన్నింటినీ దశల వారీగా బ్లాక్‌చెయిన్ వ్యవస్థలోకి తీసుకువస్తామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టును రెండు నెలలు పరిశీలించి లోపాలు ఉంటే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో భూ సమస్యలు, కోర్టు వివాదాలు గణనీయంగా తగ్గుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

**కాంగ్రెస్ నియోజక వర్గ ఇంఛార్జి శ్రీ హరి రావు**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం లో పూర్తి బాధ్యత వహిస్తూ నైతిక బాధ్యతగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు డిమాండ్ చేశారు. గురువారం దిలావర్‌పూర్, సారంగాపూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## శ్రీనివాసుడి భక్తులకు

# ఊరట..

## టీటీడీ కొత్త సౌకర్యం!

కలియుగ వైకుంఠనాథుడు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే శ్రీవాణి భక్తులకు టీటీడీ ఓ శుభవార్త అందించింది. భారీ విరాళాలు ఇచ్చి స్వామివారి వీఐపీ బ్రేక్ దర్శనానికి వెళ్లే భక్తులకు వసతి పరంగా చిన్న అసౌకర్యం ఉంటూ వస్తోంది. దర్శన సమయం వరకు గంటల తరబడి వేచి ఉండేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు చెక్ పెడుతూ.. విమానాశ్రయాల్లో ఉండే తరహాలో ఒక ఆధునిక విశ్రాంతి కేంద్రాన్ని (లాంజ్‌ను) నిర్మించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి తాజాగా నిర్ణయించింది.

ప్రస్తుతం శ్రీవాణి దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకునే భక్తులకు వసతి పరంగా కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో విరాళం చెల్లించి, టికెట్లు పొందిన వారికి మాత్రమే టీటీడీ గదులు కేటాయిస్తోంది. కరెంట్ బుకింగ్‌లో శ్రీవాణి దర్శనం కోసం టికెట్లు పొందిన వారికి మాత్రం గదులు దొరకడం లేదు. ఈ విధానంలో ఉదయం 9 గంటలకు దర్శన టికెట్ పొందిన భక్తుడు సాయంత్రం 4 గంటల వరకు బయటే వేచి ఉండాల్సి వస్తోంది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు సదుపాయాలు లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులతో వచ్చే భక్తులు తీవ్రంగా అలసిపోతున్నారు.

ఈ పరిస్థితిని నివారించాలనే ఉద్దేశంతో శ్రీవాణి భక్తులు సౌకర్యవంతంగా వేచి ఉండేందుకు ఒక ప్రత్యేకమైన లాంజ్‌ను సిద్ధం చేయాలని టీటీడీ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఆధునిక లాంజ్ నిర్మాణం కోసం తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో ఉన్న 'న్యూ ఉడ్‌సైడ్ హోటల్' ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. గతంలో హోటల్‌గా నడిచిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా ఖాళీగా ఉంది. ఈ విశాలమైన ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో నవీకరించి, అత్యాధునిక హంగులతో లగ్జరీ లాంజ్‌గా మార్చనున్నారు.

ఈ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించబోతున్నారు. విమానాశ్రయాల్లో కనిపించే ప్రీమియం లాంజ్‌ల మాదిరిగానే ఇక్కడ కూడా విశ్రాంతి గదులు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కుర్చీలు, ఆధునిక ఫర్నిచర్, పరిశుభ్రమైన స్నానాల గదులు, వేగవంతమైన ఇంటర్నెట్ (వైఫై) సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తులు అల్పాహారం, భోజనం చేసేందుకు వీలుగా ఇదే ప్రాంగణంలో ఒక ప్రత్యేక ఫుడ్‌కోర్ట్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. తద్వారా వేచి ఉండే సమయంలో భక్తులు బయటకు వెళ్లే పని లేకుండా అన్ని సదుపాయాలు ఒకే చోట దొరుకుతాయి.

శ్రీవాణి ట్రస్ట్‌కు పది వేల రూపాయలు విరాళంగా ఇచ్చి, అదనంగా ఐదు వందల రూపాయలు పెట్టి టికెట్ కొనుగోలు చేసే వారికి స్వామివారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. ఇలా ప్రతిరోజూ మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ ద్వారా ఐదు వందల మందికి అవకాశం ఇస్తున్నారు. అప్పటికప్పుడు తిరుమలకు వచ్చే వారి కోసం రోజూ మరో ఐదు వందల టికెట్లను కరెంట్ బుకింగ్ ద్వారా జారీ చేస్తున్నారు. వీటిని కూడా ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక విమానాల్లో వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో రోజూ రెండు వందల టికెట్లు ఆఫ్‌లైన్ విధానంలో అందిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఈ టికెట్లు పొందొచ్చు. ఒకసారి ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తే.. మళ్లీ టికెట్ పొందడం కష్టమే. అంతేకాకుండా గతంలో విరాళాలు ఇచ్చి దర్శన భాగ్యం పొందని వారి కోసం రోజూ మరో మూడు వందల టికెట్లను టీటీడీ కేటాయిస్తోంది. రానున్న రోజుల్లో ఈ కొత్త లాంజ్ అందుబాటులోకి వస్తే శ్రీవాణి భక్తుల తిరుమల యాత్ర మరింత సులభతరం అవుతుంది.



ఫోటో స్టోరీ



ఈ చారిత్రక ఫోటోలో 1915లో ఈజిప్ట్‌లో ఉన్న బ్రిటిష్ ఇండియన్ ఆర్మీకి చెందిన భారతీయ సైనికులు కనిపిస్తున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో ఒట్టోమన్ (టర్కీ) దళాలు సూయజ్ కాలువపై దాడి చేసినప్పుడు, భారతీయ సైనికులు ధైర్యంగా పోరాడి ఆ కీలక జలమార్గాన్ని రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. సూయజ్ కాలువ యూరప్ మరియు ఆసియాను కలిపే అత్యంత వ్యూహాత్మక మార్గం. వేలాది మంది భారతీయ సైనికుల సేవలు, త్యాగాలు ప్రపంచ యుద్ధ చరిత్రలోనే కాకుండా భారత సైనిక చరిత్రలో కూడా చిరస్మరణీయంగా నిలిచాయి.

### మూడు దేశాల మధ్య యుద్ధం తెప్పిస్తున్న నది కథ

# నైలు నాగరికత

## నదికి వేల ఏళ్ల నాగరికత..

### ఆ నీటితోనే ప్రపంచంలోనే గొప్ప సామ్రాజ్యాల ఆవిర్భావం

నైలు నది కేవలం ఒక జలప్రవాహం కాదు. ఇది వేల సంవత్సరాలుగా ఒక మహా నాగరికతను పోషించిన, ఆకారం ఇచ్చిన, ఇప్పటికీ కోట్లాది మంది జీవనాధారంగా నిలిచిన ప్రకృతి వరం. సుమారు 6,600 కిలోమీటర్లకు పైగా పొడవున్న ఈ నది ప్రపంచంలోనే అత్యంత పొడవైనదిగా పరిగణించబడుతుం ది. ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాల గుండా ప్రవహిస్తూ, చివరకు మధ్యధరా సముద్రంలో కలుస్తుంది.



**భౌగోళిక విశేషాలు..**

నైలు ప్రధానంగా రెండు ప్రధాన శాఖల కలయిక. విక్టోరియా సరస్సు నుంచి పుట్టే వైట్ నైల్, ఇథియోపియాలోని తానా సరస్సు నుంచి వచ్చే బ్లూ నైల్. ఈ రెండూ సూడాన్‌లో కలుస్తాయి. నైలు నదిలో నీరు, మట్టిలో సుమారు 85 శాతం బ్లూ నైల్ నుంచే వస్తుంది. తరువాత ఉత్తరం వైపు ప్రవహించి ఈజిప్ట్ గుండా వెళ్లి సముద్రంలో కలుస్తుంది. దక్షిణం నుంచి ఉత్తరం వైపు ప్రవహించడం దీని ప్రత్యేకత.

**ఈజిప్ట్‌కు జీవనాడి..**

గ్రీకు చరిత్రకారుడు హెరోడోటస్ చెప్పినట్లు, "ఈజిప్ట్ నైలు నది ఇచ్చిన బహుమతి." ఈజిప్ట్‌లో 95 శాతం ఎడారి. నైలు లేకపోతే మిగిలిన భాగం కూడా జీవించలేని స్థితికి చేరేది. నది తెచ్చే సారవంతమైన మట్టి, నీటితో గోధుమలు, బార్లీ వంటి పంటలు పండించి, ప్రాచీన నాగరికతకు ఆహారం అందించారు. ప్రాచీన ఈజిప్షియన్లు నైలును దేవునిగా పూజించేవారు. ఏటా వచ్చే వరదల ఆధారంగా క్యాలెండర్‌ను రూపొందించారు. పంటల కోసం గణితం, కాలువల నిర్మాణం కోసం ఇంజనీరింగ్ నేర్చుకున్నారు. పిరమిడ్ల నిర్మాణానికి అవసరమైన రాళ్లను నది ద్వారా పడవల్లో తరలించారు. సూడాన్‌లో ఈజిప్ట్ కంటే ఎక్కువ పిరమిడ్లు ఉన్నాయని తెలుస్తుంది.

**రామ్ బ్రెడ్ బాస్కెట్..**

నైలు నది ఒడ్డున పెరిగే పాపైరస్ మొక్కను రాత కోసం ఈజిప్షియన్లు వాడేవారు. వాణిజ్యంలో బంగారం, ఏనుగు దంతాలు, సుగంధ ద్రవ్యాలు పడవల ద్వారా తరలించేవారు. ఈ వ్యాపారం ఆఫ్రికా నుంచి ఆసియా వరకు విస్తరించింది. రోమ్ నగరానికి ఈజిప్ట్ నుంచి ఆహారం వెళ్లేది. అందుకే ఈజిప్ట్‌ను రోమ్ "బ్రెడ్‌బాస్కెట్" అనేవారు.



**నైలు నది ప్రత్యేకతలు..**

నైలు నదిలోని మొసళ్లు ప్రపంచంలోనే అతి పొడవైన సరీసృపాల్లో ఉంటాయి. వెయ్యి కిలోలకు పైగా బరువు ఉండి, నీటిలో వేగంగా కదులుతాయి. ప్రాచీనులు వాటినికూడా పూజించేవారు. ఆఫ్రికాలో ఏటా వందల మంది మొసళ్ల దాడుల్లో ప్రాణాలు కోల్పోతుంటారు.

**ఆస్వాన్ డ్యామ్ తో ఆధునిక అభివృద్ధి..**

ఈజిప్ట్ నైలుపై ఆస్వాన్ డ్యామ్‌ను నిర్మించింది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఒకటి. దీని ద్వారా దేశానికి అవసరమైన విద్యుత్తులో గణనీయమైన భాగం ఉత్పత్తి అవుతుంది. వరదలు నియంత్రించబడ్డాయి. ఏడాది పొడవునా సాగునీరు అందుతోంది. అయితే డ్యామ్ నిర్మాణంతో కొన్ని ముఖ్యమైన గుళ్లు మునిగిపోయాయి. యునెస్కో ప్రయత్నాలతో వాటిని 60 మీటర్ల ఎత్తుకు తరలించి కాపాడారు. సారవంతమైన మట్టి రావడం ఆగిపోయింది. ఫలితంగా రైతులు రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. నైలు ఏటా సుమారు 9 కోట్ల టన్నుల మట్టిని తీసుకువచ్చేది. డెల్టా అంతరిక్షం నుంచి కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

**మూడు దేశాల మధ్య ఘర్షణ..**

నైలు నది ఇప్పుడు కేవలం జీవనాడి మాత్రమే కాకుం డా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కేంద్రంగా మారింది. ముఖ్యంగా ఈజిప్ట్, సూడాన్, ఇథియోపియా అనే మూడు దే శాల మధ్య నీటి పంపిణీ విషయంలో తీవ్ర మైన విభేదాలు కొనసాగుతున్నాయి. ఇథియోపియా బ్లూ నైల్‌పై గ్రాండ్ ఇథియోపియన్ రినైసెన్స్ డ్యామ్ అనే భారీ ఆనకట్టను నిర్మించి పూర్తిగా నిర్వహణలోకి తీసుకొచ్చింది. ఇది ఇథియోపియాకు విద్యుత్ ఉత్పత్తికి పెద్ద లాభం. అయితే దిగువన ఉన్న ఈజిప్ట్, సూడాన్‌లు ఈ ఏకపక్ష చర్యల వల్ల తమకు నీటి కొరత, వరదలు లేదా కరువు ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈజిప్ట్‌కు నైలు లేకపో తే పది కోట్ల మంది ప్రజలు జీవించలేరని, అవసరమైతే డ్యామ్‌ను కూడా ధ్వంసం చేస్తామని గతంలో ప్రకటించిన స్థాయి హెచ్చరికలు వచ్చాయి.

**చర్చలు విఫలం..**

నదీ వివాదం పై మూడు దేశాల మధ్య చర్చలు పలుమార్లు విఫలమయ్యాయి. నీటి భద్రత జీవన–మరణ సమస్యగా మారినందున, ఈ మూడు దేశాల మధ్య సైనిక సంఘర్షణ లేదా యుద్ధం జరిగే అవకాశం అంతర్జాతీయ విశ్లేషకులు ఎప్పటినుంచో చర్చిస్తున్నారు. ఒకవైపు ఎగువ దేశం అభివృద్ధి హక్కు, మరోవైపు దిగువ దేశాల చారిత్రక నీటి హక్కులు, సంఘర్షణ నైలు నదిని భవిష్యత్తులో శాంతి లేదా యుద్ధం మధ్య నిర్ణయించే కీలక అంశంగా మార్చింది.

**నది జన్మస్థానం ఇప్పటికీ మిస్టరీ..**

నైలు నది జన్మస్థానం ఇప్పటికీ పూర్తి గా నిర్ధారించబడలేదు. 2006లో బ్రిటిష్–న్యూజిలాండ్ బృందం ఒక ప్రదేశాన్ని గుర్తించినట్లు ప్రకటించింది. 2022లో మరో బృం దం వేరే ప్రదేశాన్ని సూచించింది. నది కొన్ని ప్రాంతాల్లో 26 మీటర్ల కు పైగా లోతుగా ఉంటుంది. దాని గర్భంలో పురాతన గుళ్లు, విగ్రహాలు దాగి ఉండవచ్చని అనుమానాలు ఉన్నాయి. నైలు బేసిన్‌లో టాంజానియా, బురుండి, రువాండా, కెన్యా, ఉగాండా, ఇథియోపియా, దక్షిణ సూడాన్, సూడాన్, ఈజిప్ట్ వంటి దేశాలున్నాయి. కాంగో, ఎరిట్రియా ప్రభావం కనిపిస్తుంది.

వేల ఏళ్లుగా నాగరికతను కాపాడిన ఈ నది, ఇప్పుడు తనను తాను కాపాడుకునే స్థితిలో ఉంది. నైలు చరిత్రను, మనిషి అవసరాలను, ప్రకృతి సమతుల్యతను ఒకేసారి గుర్తు చేస్తుంది. ఒకే నది మొత్తం నాగరికతకు జన్మనిచ్చినట్లు, ఇప్పుడు ఆ నదిని కాపాడుకోవడం మానవాళి సమిష్టి బాధ్యతగా మారింది.

**-నరేష్ , ముద్ర**




## 'గ్రేటర్' ఎన్నికలు లేనట్లే?

(మొదటి పేజీ తరువాయి)

**కాంగ్రెస్‌కు రాజకీయ ఇబ్బందులు**

హైకోర్టు స్టేతో అధికార కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. రాజధానిలో రాజకీయ ఆధిక్యం సాధించాలని భావిస్తున్న సమయంలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడు కోర్టు ఆదేశా ల మేరకు వార్డుల పునర్విభజనను పూర్తిగా పునఃసమీక్షించి, పారదర్శకంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ప్రతిపక్షాలకు కొత్త అస్త్రం**

ఈ పరిణామంతో బీఆర్ఎస్, బీజేపీ సహా ప్రతిపక్షాలకు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించేందుకు అవకాశం లభించింది. అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులు మార్చే ప్రయత్నం చేశారని ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు హైకోర్టు తీర్పును రాజకీయంగా వినియోగించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**ఎన్నికల షెడ్యూల్‌పై అనిశ్చితి**

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి నిర్వహించాల్సి రావడంతో జీహెచ్ఎంసీ ఎన్నికలు మరికొంతకాలం వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. డీలిమిటేషన్, అభ్యంతరాల పరిశీలన, తుది నోటిఫికేషన్ వంటి ప్రక్రియలు పూర్తయ్యే వరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దీంతో గ్రేటర్ రాజకీయాలు మరో సారి హైకోర్టు తీర్పు చుట్టూనే తిరిగే పరిస్థితి నెలకొంది.

## భార్యకు కూడా చెప్పుకోలేని

# సమస్యలు

పురుషులు ఎదుర్కొనే చాలా మానసిక, శారీరక సమస్యలు బయటకు కనిపించవు. చాలామంది పురుషులు తమ బాధలు, ఆరోగ్య సమస్యలు లేదా భావోద్వేగాలను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడరు. దీంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కుటుంబ సభ్యులకు కూడా తెలియకుండా పోతుంటాయి. ముఖ్యంగా భార్యలు, తల్లులు, సోదరీమణులు లేదా కుటుంబ సభ్యులు ఈ విషయాలను అర్థం చేసుకుంటే పురుషుల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కాపాడడంలో ఎంతో సహాయపడుతుందని దివిస్ ఫౌండేషన్ సైకాలజిస్ట్ హరీష్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన పురుషుల్లో కనిపించని ఐదు ప్రధాన సమస్యలు తెలుసుకుందాం.

ఆయన తెలిపిన ప్రకారం.. చిన్నప్పటి నుంచే కుటుంబానికి అండగా ఉండాలి, బాధ్యతలు మోయాలి, సంపాదించాలి అనే అంచనాలు చాలా మంది పురుషులపై ఉంటాయి. ఉద్యోగంలో ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ అవసరాలు, పిల్లల భవిష్యత్తు వంటి అనేక విషయాలు వారిని మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తాయి. అయితే "తాము బలహీనంగా కనిపించకూడదు" అనే భావనతో తమ బాధను ఎవరికీ చెప్పకుండా మనసులోనే దాచుకుంటారు. దీని వల్ల ఆందోళన, ఒత్తిడి, చిరాకు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

మహిళల్లో మెనోపాజ్ గురించి ఎక్కువగా మాట్లాడుతుంటారు. కానీ పురుషుల్లో కూడా వయసు పెరిగే కొద్దీ టెస్టోస్టెరాన్ హార్మోన్ స్థాయిలు తగ్గడం ప్రారంభమవుతుంది. దీనిని వైద్యులు "ఆండ్రోపాజ్" అని పిలుస్తారు. సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల వయస్సు తర్వాత ఈ మార్పులు కనిపించవచ్చు. దీని ప్రభావంతో శక్తి తగ్గడం, త్వరగా అలసిపోవడం, కండరాల బలం తగ్గడం, ఏకాగ్రత తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు, లైంగిక ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు రావచ్చు. అయితే చాలామంది పురుషులు ఈ విషయాలను చెప్పడానికి సంకోచిస్తారు. పురుషులు తమ భావోద్వేగాల ను బయటపెట్టలేకపోవడం కూడా ఒక పెద్ద సమస్య. 'పురుషులు ఏడవకూడదు', 'బలంగా ఉండాలి' అనే సామాజిక అభిప్రాయాల కారణంగా వారు తమ బాధ, నిరాశ, ఒంటరితనం, భయాన్ని బయటపెట్టరు. కొన్నిసార్లు వారు మౌనంగా ఉండడం లేదా చిరాకుగా ప్రవర్తించడం వెనుక కూడా తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉండవచ్చు. కుటుంబ సభ్యులు దీనిని అర్థం చేసుకుని వారితో మాట్లాడేందుకు సమయం కేటాయించడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం కూడా చాలా మంది పురుషుల్లో కనిపించే సమస్య. పని ఒత్తిడి, సరైన వ్యాయామం లేకపోవడం, ధూమపానం, మద్యం తాగడం, తగినంత నిద్ర లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి కారణాల వల్ల గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. ఛాతిలో బరువుగా అనిపించడం, ఎక్కువ చెమటలు పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచూ అలసటగా ఉండటం వంటి లక్షణాలను చిన్న సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఇవి గుండె సంబంధిత వ్యాధులకు ప్రారంభ సంకేతాలు కావచ్చు. అందుకే ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

మానసిక ఆరోగ్యంపై మాట్లాడేందుకు సంకోచించడం కూడా పురుషుల్లో ఎక్కువగా కనిపించే సమస్య. డిప్రెషన్, ఆందోళన, బర్న్‌అవుట్ వంటి సమస్యలు ఎవరికైనా రావచ్చు. కానీ చాలామంది పురుషులు కౌన్సెలర్ లేదా మానసిక వైద్యుడిని కలవడానికి వెనుకాడుతుంటారు. ఇతరులు తమ గురించి ఏమనుకుంటారో అనే భయంతో సమస్యలను మనసులోనే దాచుకుంటారు. కొందరు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం, మరికొందరు పూర్తిగా పనిలో మునిగిపోవడం ద్వారా తమ భావాలను దాచే ప్రయత్నం చేస్తారు. ఇలా చేయడం వల్ల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. పురుషుల ఆరోగ్యాన్ని కాపాడడంలో కుటుంబ సభ్యుల పాత్ర కూడా చాలా కీలకం. వారితో తరచూ మాట్లాడటం, వారి భావాలను అర్థం చేసుకోవడం, ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం, సమయానికి విశ్రాంతి తీసుకునేలా చూడడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయడం వంటి చర్యలు ఎంతో ఉపయోగపడతాయి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు..

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 24.07.2026
www.mudranews.in | @mudranews



## ఇన్సులిన్ పనితీరును ఉసిరికాయ మెరుగుపరుస్తుంది

ఉసిరికాయ శరీరంలో ఇన్సులిన్ సెన్సి టివిటీని పెంచి, గ్లూకోజ్‌ను కణాలు సమర్థవంతంగా వినియోగించుకునేలా చేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యంగా ఉండేందుకు సహాయపడుతుంది.



### ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్, కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్ ను నిరసిస్తూ

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ముద్ర కూకట్‌పల్లి :** ఢిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యంగా లాఠీఛార్జ్ చేయడాన్ని, అలాగే వారికి మద్దతుగా వెళ్లిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేలను అన్యాయంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మహంకాళి నగర్ చౌరస్తా నుండి గుడ్ విల్ హోటల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై




నిలదీస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేతలు గళం విప్పి ప్రశ్నిస్తే వారిని సభ నుంచి బయటకు పంపడమే కాకుండా, బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. దేశంలోని యువత ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వమే నేడు అదే యువతపై లాఠీఛార్జ్ చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళా నాయకురాళ్లు భారీ సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్‌పై సమీక్ష



**ముద్ర, శేరిలింగంపల్లి :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే – ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ ఇంచార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఏసీ ఛైర్మెన్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి జగదీశ్వర్ గౌడ్ మరియు పలువురు మాజీ కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని బూత్ ఇంచార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సర్వే డేటా ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, కాబట్టి బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని అన్ని బూత్‌లలో ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా సర్వే సిబ్బందికి సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డివిజన్ ముఖ్య నాయకులు, బూత్ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణకు విజయ వంతంగా మోకాలి శస్త్రచికిత్స



**ముద్ర, హైదరాబాద్:** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మోకాలి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైంది. వైద్యుల బృందం సుమారు మూడు గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించగా, ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు. వైద్యుల సూచన మేరకు కొద్ది రోజులపాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం ఆయన సాధారణ కార్యకలాపాలతో పాటు సినీ, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. బాలకృష్ణ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని అభిమానులు, పార్టీ శ్రేణులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

## కిదాంబి శ్రీకాంత్‌కు సాయి ఎండీ అభినందనలు



**ముద్ర, హైదరాబాద్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇటీవల జరిగిన BWF US ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచి భారత బ్యాడ్మింటన్‌కు మరోసారి గర్వకారణమైన ప్రదర్శన చేసిన స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి అభినందించారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కిదాంబి శ్రీకాంత్ డాక్టర్ సోనీ బాలాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎండీ, రానున్న అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తెలంగాణకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. భారత బ్యాడ్మింటన్‌లో కిదాంబి శ్రీకాంత్ సాధించిన విజయాలు యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో రాణించాలని ఆకాంక్షించారు.

## ఓటు హక్కు పరిరక్షణ బీఎల్‌ఏల బాధ్యత

**తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**
**సమావేశంలో పాల్గొన్న టిపిసిసి పర్యవేక్షకులు కోటం వినయ్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి. తాండూర్:**
ఎస్ ఐ ఆర్ ప్రక్రియలు భాగంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్ని పెద్ద మొత్తంలో ఓట్లను తొలగించే ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రోజున తాండూరు పట్టణ బి ఎల్ ఏ లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని, SIR పై బి ఎల్ ఏలకు మరియు పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారుమాట్లాడుతూ...SIR ప్రక్రియలు భాగంగాబి ఎల్ ఏ లు చాలాకీలకపాత్ర పోషిస్తున్నారు, మిగతా 10రోజులు కూడా మీ పాత్ర కీలకంగా ఉండాలని తెలిపారుఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన




అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు. అర్హత ఉన్న ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి బి ఎల్ ఎ మరియు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పని చేయాలన్నారు. ఇకనుండి కూడా క్రమం తప్పకుండా ప్రతిఇంటింటికీ వెళ్లి ప్రజలకు SIR ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ప్రతి బూత్, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజల ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో కీలకమని, ఈ బాధ్యతను ప్రతి కార్యకర్త నిబద్ధతతో నిర్వర్తించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో TPCC SIR పర్యవేక్షకులు కోటం వినయ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ SIR కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా హరితహారం



**ముద్ర, కాప్రా:** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న హరిత హారం కార్యక్రమంలో భాగంగా తిరుమల నగర్, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరిత హారం కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ కాలనీ అధ్యక్షుడు మల్లేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ గురువారం జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి డా. విజయ్ చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ప్రజలకు అందించాల్సిన సేవల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం పట్ల డీఎంహెచ్ఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డా. విజయ్ చంద్ర వెంటనే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం క్షయవ్యాధి మొబైల్ ఎక్స్–రే యూనిట్ పనితీరును పరిశీలించి, సేవలు ప్రజలకు అందుతున్నాయా అనే విషయాన్ని సమీక్షించారు. ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసి ఈ–ఔషధి పోర్టల్లో నమోదైన ఔషధ నిల్వలు, పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించడంతో పాటు, మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి ధృవీకరించారు. గడువు ముగియబోతున్న ఔషధాల కోసం ప్రత్యేకంగా "నియర్ ఎక్స్పైరీ డ్రగ్ కార్నర్" ఏర్పాటు చేసి, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఫార్మసీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో ప్రజల సంక్షేమమే



అత్యున్నత ప్రాధాన్యం. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని గౌరవంగా, ఆప్యాయంగా ఆదరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం అందరి కర్తవ్యం. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై ఎలాంటి ఆలోచన లేకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాము అని స్పష్టం చేశారు. అలాగే అందరూ విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్ణీత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు., విధుల పట్ల నిర్లక్ష్యం లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను కఠినంగా పరిగణించి అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

## ఏళ్ల క్రితం వదిలేసిన భర్త మృతి.. దైన్య స్థితిలో అంత్యక్రియలు

**ముద్ర, కూకట్‌పల్లి :** కుటుంబం నుంచి దూరమై, దైనీయ స్థితిలో ఫుట్‌పాత్‌పై జీవిస్తూ క్యాన్సర్‌తో బాధపడిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన హృదయవిదారక ఘటన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే: మేడ్చల్, హ్యాపీ నగర్ కాలనీకి చెందిన కొప్పుల పుష్ప (52) భర్త గుండేటి జనార్దన్ (64) సుమారు 29 సంవత్సరాల క్రితం భార్యాపిల్లలను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆమె కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంది. జనార్దన్ కుటుంబం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కాగా, గతేడాది మార్చి



2026లో కొడుకు రూపేశ్‌కు కొండాపూర్‌లో జనార్దన్ కనిపించాడు. అప్పటికే ఆయన ఫుట్‌పాత్‌పై భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తేలింది. ఆరోగ్యం క్షీణించడంతో కుమారుడు కొంపల్లిలోని కనెక్ట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో పరీక్షలు చేయించగా క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయితే చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చినప్పటికీ, ఆయన వారి వద్దకు వెళ్లేందుకు నిరాకరించి రోడ్డుపైనే జీవనం సాగిస్తున్నాడు. పోషకాహార లోపం, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం (జూలై 23) మధ్యాహ్నం మృతి చెందాడు. హైదర్ నగర్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ, మైసమ్మ ఆలయం వెనుక ఉన్న ఫ్యాబ్రికేషన్ షట్టర్ ముందు నిద్రిస్తున్న ఆయన మృతి చెందినట్లు కేపీహెచ్‌బీ పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భార్య పుష్ప ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, ఆయన ఎవరిపై ఫిర్యాదు లేదని పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులైన అందరినీ ఓటరుగా నమోదు చెయ్యాలి

**ముద్ర, కాప్రా:** కాప్రా వంపుగూడ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సాయి బాబా నగర్ వద్ద నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సర్వే కార్యక్రమాన్ని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఎల్ఓలతో కలిసి ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ప్రక్రియను సమీక్షించారు. అనంతరం కాంగ్రెస్ వాంపుగుడ డివిజన్ అధ్యక్షులు అనుప్ రాజ్ యా ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పించి, ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత ఎన్యూమరేషన్ దరఖాస్తులను సమర్పించాలని



సూచించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

గురువారం 23.07.2026

www.mudranews.in | @mudranews



## ప్రీడయాబెటిస్, డయాబెటిస్ ఉన్నవారికి ఉసిరి ఉపయోగకరం



సరైన ఆహారం, వ్యాయామంతో పాటు ఉసిరికాయను ఆహారంలో భాగం చేసుకోవడం ప్రీడయాబెటిస్ లేదా టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి అదనపు ప్రయోజనాన్ని అందించవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.

## కళాశాలలో అలరించిన గోరింటాకు వేడుకలు



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గాడి పెల్లి హరిప్రియ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని, గోరింటాకు పెట్టుకోవడం వెనుక నేపథ్యాన్ని విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు మరియు ఉపాధ్యాయినిలు గోరింటాకు పెట్టుకొని ఆనందంతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్ మరియు ఉపాధ్యాయ బృందం అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగమ్మకు భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన గంగపుత్రులు



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలోని రామ్ నగర్ లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ ముద్దుబిడ్డలు, గంగపుత్రులు గురువారం రోజు ఊరపోచవ్వ, ఐదు జతల పోచవ్వ, మహాలక్ష్మి, పోచమ్మ తల్లులకు భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్, జగిత్యాల జిల్లా ఎండోమెంట్ ధార్మిక సెల్ కన్వీనర్ మాడవేణి నరేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘ సభ్యులు సంఘం అధ్యక్షులు మాడవేణి సురేష్, గడ్డం అశోక్, తోకల శ్రీనివాస్, బిజెపి కోరుట్ల పట్టణ శాఖ ఉపాధ్యక్షురాలు మాడవేణి స్వప్న, గడ్డం ఆశమ్మ, దేశవేని కవిత, సంఘ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిగురుమామిడి బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు భైరి శంకర్ ముదిరాజ్**

**రాష్ట్ర నాయకులు కోమటి రెడ్డి రాంగోపాల్ రెడ్డి**



**ముద్ర చిగురుమామిడి:** భారతీయ జనతా పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్ అధ్యక్షతన చిగురుమామిడి గ్రామంలో మండల కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించబడింది ఈ సమావేశానికి సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తర్వాత నూతనంగా ఎన్నికైన మండల కమిటీ నాయకులకు జిల్లా అధ్యక్షుని చేతుల మీదుగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిద్దిపేట్ జిల్లా ప్రధానకార్యదర్శి ఖమ్మం వెంకటేశం. ఉపాధ్యక్షులు మాచర్ల కుమారస్వామి. జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్. హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులు గునుకుల మధుసూదన్ రెడ్డి బుద్ధర్తి మహేందర్ మాజీ మండల అధ్యక్షులు అచ్చ రవీందర్ ఉపాధ్యక్షులు పన్యాల శ్రీధర్ రెడ్డి గందే చిరంజీవి బుర్ర శ్రీనివాస్ పెసరి హరీష్ కార్యదర్శులు నడిగొట్టు కిరణ్ నక్క రాజేందర్ తులైలా వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ ఐలపాక సాగర్, కిసాన్ మోర్చ అధ్యక్షులు శ్యమకూర మోహన్ రెడ్డి యువ మోర్చ అధ్యక్షులు సిద్ధంకి అనిల్, ఓబీసీ మోర్చ అధ్యక్షులు పడాల శ్రీనివాస్, ఎస్సీ మో అధ్యక్షులు దొంత కర్నాకర్, గిరిజన మోర్చ అధ్యక్షులు లోకిని ఆంజనేయులు, కంది శంకర్ భిమర లక్ష్మణ్, మండలంకార్యవర్గ సభ్యులు కరపూడి వెంకటేష్ ,మామిడి రమేష్ జంగ శ్రీనివాస్ రెడ్డి ,చిమ్మర్తి తిరుపతి ,పథేం మొగిలి ,బూత్ అధ్యక్షులు బరిగేలా మోహన్ పెండ్యాల రాజేందర్, కయ్యం రజనీ కాంత్, గుళ్ళ సంతోష్, ఎన్నం సంతోష్ , గోపాగోని అప్పల శ్రీనివాస్, శ్రీనివాస్ ,కాసాని సతీష్ ,పోలోజు వెంకటస్వామి, కన్నం శ్రీనివాస్ సతీష్, యువ మోర్చ నాయకులు గొలి ప్రతినవ్ రెడ్డి, సంగెం అజయ్, కానవేని రజనీకాంత్, సంధవేని రాకేష్ పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం చొరవతో విద్యార్థులకు ప్రత్యేక బస్సు

*** కృతజ్ఞతలు చెప్పిన సర్పంచ్ గుళ్ళ రజితారాజు....**



**ముద్ర చిగురుమామిడి :** హుస్నాబాద్ మండలంలోని నవాబుపేట–ఇందుర్తి గ్రామాల విద్యార్థుల రవాణా సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామ సర్పంచ్ గుళ్ల రజిత రాజు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి స్కూల్ సమయానికి నవాబుపేట–ఇందుర్తి మీదుగా కరీంనగర్‌కు వెళ్లే ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సు సౌకర్యంతో ములుకనూరు మోడల్ స్కూల్‌లో చదువుకునే విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలిగిందని గ్రామస్థులు తెలిపారు. ఇంతకుముందు బస్సు లేకపోవడంతో 12 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నెలకు రూ.1,000 వరకు ఆటో ఖర్చు భరించాల్సి వచ్చేదని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న వారు సుందరగిరి వరకు నడుచుకుంటూ వెళ్లడం లేదా లిఫ్ట్ అడిగి ప్రయాణించడం వంటి కష్టాలు పడేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రత్యేక బస్సు అందుబాటులోకి రావడంతో విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయని గ్రామ సర్పంచ్ రజిత రాజు తెలిపారు. ఇదిలా ఉంటే టైం కి బస్ రావడం పట్ల స్కూల్ పిల్లలు సంతోషం వ్యక్తం చేస్తూ , మంత్రి పొన్నం కి సర్పంచ్ గుళ్ల రజితరాజు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గుళ్ళ రజితరాజు , ఉపసర్పంచ్ గ్రామ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి ,వార్డు సభ్యులు గ్రామస్తులు,స్కూల్ పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ధర్మపన్నాలు పలుకుతూ ధమననీతినా?

- **లాఠీ చార్జ్, టియర్ గ్యాస్ తో విద్యార్థులపై దాడులు చేస్తారా**
- **భేషరతుగా విద్యార్థులకు ప్రధాని మోదీ,అమిత్ షా క్షమాపణలు చెప్పాలి**
- **కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**
- **సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మేధావులు,డాక్టర్లు,లాయర్లు విద్యార్థులతో కలిసి 'చాయ్ పే చర్చ'**



**ముద్ర, కరీంనగర్ :** దేశం, ధర్మం అంటూ బిజెపి మాటలకే పరిమితం అవుతోందని, దేశం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.నీట్ పరీక్ష లీకేజీ పై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనకు దిగుతున్న నేపథ్యంలో నరేందర్ రెడ్డి వినూత్నంగా బిజెపి దమన నీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కరీంనగర్లో చాయ్ పై చర్చ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యావంతులు, మేధావులు, లాయర్లు, సీనియర్ సిటిజనులతో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను వారితో పంచుకున్నారు. మేధావుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, అందమైన భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీ చార్జి చేయటంతో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు పార్లమెంటులో గళం విప్పారని, ప్రధానమంత్రి అధికారిక నివాసం ముందు శాంతియుత ధర్నాకు దిగితే వారిని కర్కషంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీని ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.కలెక్టరేట్ రోడ్డులోని సిరి టీ హోటల్ వద్ద చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్,పెంచాల లక్ష్మణ్ రావు,ప్రముఖ డాక్టర్లు చాట్ల శ్రీధర్, వొడ్డే రాంరెడ్డి వాకర్స్ గుడిపాటి రమణారెడ్డి, పి కిషన్ రావు,ఎల్లారెడ్డి,బోయిని అశోక్ తో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని భేషరతుగా విద్యార్థి లోకానికి ప్రధాని మోదీ,అమిత్ షా క్షమాపణ చెప్పాలని ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై దమననీతి ప్రదర్శించడంలో కుట్ర దాగి ఉందని ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ కి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే అని నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ మండల ఉపాధ్యక్షునిగా ఎన్నికైన బుర్ర శ్రీను కు సన్మానం

**ముద్ర, చిగురుమామిడి :** భారతీయ జనతా పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్ అధ్యక్షతన చిగురుమామిడి గ్రామంలో మండల కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బీజేపీ మండల ఉపాధ్యక్షునిగా ఎన్నికైన బుర్ర శ్రీను కు సన్మానం చేశారు. పార్టీ కోసం పాటుపడుతున్న బుర్ర శీను సేవలను కొనియాడారు.



## రోడ్డు విస్తరణ భయం.. గుండెపోటుతో నిరుపేద మహిళ మృతి!

- **సుందరగిరిలో విషాదం..**
- **నివాసం పోతుందనే ఆందోళనతోనే గుండెపోటు అన్న కుటుంబ సభ్యులు**



**ముద్ర చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఇల్లు కోల్పోతామనే ఆందోళనతో ఓ నిరుపేద మహిళ గుండెపోటుతో మృతి చెందింది. గ్రామానికి చెందిన బుర్ర మధురవ్వ (55)కు చెందిన ఇల్లు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పరిధిలోకి రావడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన ఆమె గురువారం కూరగాయలు అమ్ముకుని ఇంటికి వచ్చిన అనంతరం గుండెనొప్పితో కుప్పకూలి మృతి చెందింది. ఇల్లు కోల్పోతామనే ఆందోళనే ఆమె ప్రాణాలు తీసిందని కుటుంబ సభ్యులు వాపోయారు. మధురవ్వ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

తన ఇల్లును కోల్పోతామనే భయంతో ప్రాణాలు కోల్పోయిన మధురవ్వ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిహారం అందించాలని, బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## సాంకేతికతతోనే అభివృద్ధిలో వేగం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**మహదేవపూర్, ముద్ర:** కృత్రిమ మేధస్సు సాంకేతికతను ప్రభుత్వ పనుల్లో సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగికి శిక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా ఐఏఎస్ అధికారులకు కూడా ఏఐ పై శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "తెలంగాణ రైజింగ్–2047" సాధనలో జిల్లాల అభివృద్ధికి ఏఐ శిక్షణ కీలకమని తెలిపారు. గురువారం ఐడిఓసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం టీ ఫైబర్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేటివ్ ఎఫిషియన్సీ ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, ఎఐ ఎక్స్‌పర్ట్స్ ధీరజ్, రాహుల్, ఈడీఎం శ్రీకాంత్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై నిరవధిక దీక్ష



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమైంది. జేఏసీ చైర్మన్, మనకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య నేతృత్వంలో చేపట్టిన ఈ దీక్షకు జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మద్దతు ప్రకటించారు. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుడు లింగంపల్లి నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, సీనియర్ నాయకులు బుడిగె పరుశురాం గౌడ్, మ్యాక వినోద్, లింగంపల్లి శ్రీనివాస్, భాసవేణి రాజేందర్, నూతి సాయి చరణ్, పుసాల పవన్, చింతరెడ్డి జైపాల్ రెడ్డి, ఎండి రజి, ఎండి హుస్సేన్, బండ అశోక్, ఎండి సాల్మ, జంగా అపర్ణ, అతహర్, పొన్నం శిరీష, కొలిపాక గౌతమి పాల్గొన్నారు

# సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీలకు ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ సిద్ధం

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి భారీగా జట్లు..**

**అత్యాధునిక వసతులతో ఏర్పాట్లు పూర్తి**





**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్ఈ క్లస్టర్–7 ఖో–ఖో పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల ఏర్పాట్లను ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఖో–ఖో ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు ఒత్తిడిని తగ్గించి, విజయాల వైపు నడిపిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు సమాన ప్రాధాన్యం ఇస్తున్నాయని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన అన్ని క్రీడా వనరులు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి అండర్–14, అండర్–17, అండర్–19 బాలికల విభాగాల్లో జరిగే పోటీల కోసం పాఠశాల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, జట్లు చేరుకున్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, ఇతర అవసరాలన్నీ అత్యాధునిక సౌకర్యాలతో కల్పించినట్లు చెప్పారు.

ఈ టోర్నమెంట్‌లో అండర్–14 విభాగంలో 87 జట్లు, అండర్–17 విభాగంలో 55 జట్లు, అండర్–19 విభాగంలో 13 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీల ప్రారంభోత్సవం ఈ నెల 24న ఉదయం 11 గంటలకు జరగనుంది.

ప్రారంభ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, కరీంనగర్ జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ చిత్రా మిశ్రా, సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ జంగం సునీల్ కుమార్ హాజరు కానున్నారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర ఖో–ఖో అసోసియేషన్, కరీంనగర్ జిల్లా ఖో–ఖో అసోసియేషన్ ప్రతినిధులు, బాధ్యులు కూడా పాల్గొని టోర్నమెంట్ నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

సీబీఎస్ఈ తరఫున ఇప్పటికే పరిశీలకుడు పాఠశాలకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఖో–ఖో అసోసియేషన్ రెఫరీ బోర్డు కన్వీనర్ వి. సూర్య ప్రకాష్, అంతర్జాతీయ ఖో–ఖో రెఫరీ ఏ. రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలు జట్ల మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 24.07.2026
www.mudranews.in | @mudranews



### సహజమైనది కానీ ఉసిరి మోతాదు ముఖ్యం

ఉసిరికాయ ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దీనిని మందులకు ప్రత్యామ్నాయంగా కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా మాత్రమే తీసుకోవాలి. ముఖ్యంగా డయాబెటిస్ మందులు వాడేవారు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.



# త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 23:** రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసిందన్నారు. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది. వేగంగా నీటి తరలింపు చేపట్టింది. రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు గోదావరి జలాలను తరలిస్తున్నారు.క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పరిశీలనగురువారం నాడు ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు. ఎల్నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇరిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసచారి, పాల్గొన్నారు.



## తెలంగాణ గుండెచప్పుడు సింగరేణి

**సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనిని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి**

**ముద్ర, ఖమ్మం/సత్తుపల్లి:** సింగరేణి తెలంగాణ ప్రజలతో 130 ఏళ్ల భావోద్వేగ అనుబంధం కలిగిన సంస్థ అని, దానిని భవిష్యత్ తరాలకు మరింత బలోపేతంగా అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు.పోటీ ప్రపంచంలో సింగరేణి ప్రైవేటు సంస్థలు, దిగుమతి బొగ్గుతో పోటీ పడాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్న భట్టి, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. మైనింగ్ ప్రక్రియలో బొగ్గుతో పాటు వచ్చే ఓవర్‌బర్డెన్ కలిసిపోకుండా ప్రతి లోడింగ్ పాయింట్ వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యత లేని బొగ్గు సరఫరా వల్ల రవాణా ఖర్చులు పెరగడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరు దెబ్బతింటుందని చెప్పారు.గత పదేళ్లలో కొత్త కోల్ బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల పలు అవకాశాలు కోల్పోయిందని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో కనీసం పదేళ్ల ముందస్తు ప్రణాళికతో సంస్థ పనిచేయాలని సూచించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి, జెన్‌కో సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాడిచెర్ల–2, నైని కోల్ బ్లాక్‌లకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగే కొత్త కోల్ బ్లాక్‌ల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొనేలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో సింగరేణి కూడా సోలార్, పంప్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ రంగాల్లో విస్తరించాలని సూచించారు. అలాగే సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణలో కూడా సంస్థ అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సింగరేణిని ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అధికారులు, ఇంజినీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాలని అన్నారు.

అనంతరం కిష్టారంలో నిర్మించిన సింగరేణి ఉద్యోగుల నివాస క్వార్టర్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సీఎండీ హరీష్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీజీపీ సి.వి. ఆనంద్
- బాధితులకు త్వరగా నగదు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలకు ఆదేశాలు




**ముద్ర, సూర్యాపేట, జూలై 23:** సైబర్ మోసాల నివారణతో పాటు బాధితులకు మోసపోయిన నగదు త్వరగా తిరిగి అందేలా బ్యాంకులు, కోర్టులతో సమన్వయంగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు.సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు చేపడుతున్న ప్రత్యేక చర్యలను డీజీపీకి వివరించారు.డీజీపీ మాట్లాడుతూ, గతంలో నక్సలిజం వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్న పోలీసు శాఖకు ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు ప్రధాన సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. వీటి నివారణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో సైబర్ మోసాల నియంత్రణకు ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ బృందం పనిచేస్తోందని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్లను నియమించామని ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రజలను మోసం చేసి ఆర్థిక నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు.సైబర్ మోసాల నుంచి రక్షణకు కీలక సూచనలుఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంక్ వివరాలను ఎవరికీ చెప్పవద్దు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు.తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే ప్రకటనలను నమ్మవద్దు.సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ఆఫర్లు, విఐపీ పేర్లతో డబ్బు అడిగే సందేశాలను విశ్వసించవద్దు.ప్రతి ఖాతాకు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించి, టూ–ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను తప్పనిసరిగా ఆన్ చేసుకోవాలి. ఎనీ డెస్క్, టీం వ్యూవర్ వంటి రిమోట్ యాప్‌లను తెలియని వారి సూచనతో ఇన్‌స్టాల్ చేయవద్దు. డబ్బులు స్వీకరించేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని గుర్తుంచుకోవాలి. పబ్లిక్ వై–ఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు చేయకూడదు.ఆధార్, పాన్, పుట్టిన తేదీ వంటి వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో పంచుకోవద్దు."సిమ్ బ్లాక్ అవుతుంది", "పార్సెల్‌లో డ్రగ్స్ దొరికాయి","మీపై కేసు ఉంది" వంటి బెదిరింపు కాల్స్‌ను నమ్మి డబ్బులు పంపవద్దు.ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో కనిపించే అతి తక్కువ ధరల ఆఫర్లకు ముందస్తు చెల్లింపులు చేయవద్దు.ప్రజల అప్రమత్తతే సైబర్ మోసాలను అరికట్టడంలో అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని పోలీసులు తెలిపారు.

## మత్తు పదార్థాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా

**: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, అదనపు ఎస్పీ లక్షి నారాయణ, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, వాటి నిరోధానికి అవలంభించాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దు రిణామాల గురించి ప్రజలను చైతన్యపరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు అన్ని పాఠశాలలు, కళాశాలలో డ్రగ్స్ పై కళాశాలలో నిర్వహించాలన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తుక్యానాయక్, అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

పట్టణ ప్రకృతి వనాలు, డపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం పట్టణ అభివృద్ధి పనుల నిర్వహణ పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం, పట్టణ ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి గురువారం పరిశీలించారు.ముందుగా డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియ, బయో మైనింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. డంపింగ్ యార్డ్ ను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, సూచించారు .అనంతరం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రధాన ప్రవేశ ద్వారానికి గేటు ఏర్పాటు చేయాలని, స్టేడియం లోపల తగినంత లైటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పట్టణ ప్రకృతి వనం శుభ్రంగా ఉండే విధంగా, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా ఉండాలన్నారు. పచ్చని చెట్ల తో వాతావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీ వాణి, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి , మున్సిపల్ అధికారులు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.



## నీట్ లీక్‌లపై ప్రశ్నిస్తే ఉరేనా?

**పీడీఎస్‌యూ వినూత్న నిరసన**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** మున్సిపాలిటీ వద్ద పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు శశి, సహాయ కార్యదర్శి యశ్వంత్, కోశాధికారి తిమ్మిడి రఘు, జిల్లా నాయకులు సురేష్, మురళి,పెరలా వెంకటేష్,శుశాంత్,పృథ్వి, విష్ణును ప్రియాంక నవ్య, స్పందన కావ్య తదితరులు పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లిలో ర్యాలీ**

**ముద్ర, కొండమల్లేపల్లి:** ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వారికి మద్దతుగా ఎన్టిఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ఎస్ఎఫ్ఐ నాయకులు సభవత్ వినోద్, రామావత్ రాజేష్, నేతల్లా జయరాం, కుంటి గొర్ల మహేష్, సుధాకర్, పరమేష్, మనోహర్, యశ్వంత్, అంజలి, శృతి, అనిత, శ్వేతా, అశ్విత, శిరీష, అనురాధ, అంకిత, ఆంజనేయులు, మహేందర్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.




## గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ముద్ర, సూర్యాపేట:** సూర్యాపేట పరిధిలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ కిచెన్, డైనింగ్ హాల్, కూరగాయల నిల్వ గది, బియ్యం తదితర నిత్యావసర వస్తువుల గోదాములను పరిశీలించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు కొద్దిసేపు హిందీ పాఠాన్ని బోధించి వారితో మమేకమయ్యారు. కంప్యూటర్ ల్యాబ్, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, డోర్లు వంటి చిన్న మరమ్మతులన్నీ 15 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణగిరిలో జగన్నాథ రథయాత్ర



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ తిరుమల గా ప్రసిద్ధిగాంచిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం సాయంత్రం జగన్నాథ రథ యాత్ర వైభవంగా నిర్వహించారు. శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేకంగా రూపొందించిన రథం మీద బలరామ, సుభద్ర, జగన్నాథ శ్రీ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వర్ణగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణలు, భజనలు కోలాటాల నడుమ ఆలయ మాడ వీధులలో రథ యాత్ర కోలాహలంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తివేదంత ఇన్స్టిట్యూట్, స్థానిక భువనగిరి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం అర్చక స్వాములు తిరుప్పావడ సేవ నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.

## ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు చామల యువసేన నాయకులు హీరే కార్ శ్రీను ఆధ్వర్యంలో భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లలకు పండ్లు, కేకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పన్నాల మల్లికార్జున్ రెడ్డి , బోయిపల్లి అచ్చిరెడ్డి, గోపె ఎల్లయ్య, సుబ్బురు సిద్దేశ్, సిలువేరు శ్రీను, గోపి నరసింహ, ప్రవీణ్, నవీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అతికం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మలిదశ ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అతికం లక్ష్మి నారాయణ నియమితులయ్యారు. గురువారం స్థానిక అమర వీరుల స్థూపం వద్ద రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. బట్టు రామచంద్రయ్య, వరిగంటి రమేష్ గౌడ్, కంచి మల్లయ్య, సంజీవ, మధు గౌడ్ పాల్గొన్నారు.

## ఏఐఎల్‌యూ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**జంతర్ మంతర్ ఘటనపై పోలీసుల తీరును ఖండించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



**ముద్ర, మిర్యాలగూడ:** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) సభ్యత్వ నమోదు కార్యక్రమం మిర్యాలగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, అక్రమ నిర్బంధాలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, నిరసన తెలిపే హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం, పోలీసులు గౌరవించాలని ఆయన అన్నారు. నిరసనలను అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.ఘటనను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి వీడియోలు తొలగింపజేయడం కూడా ఖండనీయమని అన్నారు. భారత రాజ్యాంగంలోని అధికరణలు 19, 21 కల్పించిన మౌలిక హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.శాంతియుత నిరసనకారులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల రక్షణ, చట్ట పరిపాలనను కాపాడడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని, విద్యార్థుల న్యాయమైన ఉద్యమానికి పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని మామిడి వెంకట్ రెడ్డి తెలిపారు.సంబంధిత అధికారులు సంయమనంతో, పారదర్శకంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, కోర్టు కమిటీ అధ్యక్షుడు పరమేష్, కందిమల్ల వెంకట్ రెడ్డి, కొంక వెంకన్న, కళ్యాణ్, కరుణాకర్, సుమేర, అస్మా, కొంక నిర్మల, గంగాభవాని, మైన మహేష్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ఎస్సి సెల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీపార్కులో నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ కాకునూరి మహేందర్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజి విషయంలో నైతిక భాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన రాజీనామా చేయాలనీ నిరసన తెలుపుతున్న విద్యార్థులను పాశవికంగా కొట్టడాన్ని నిరసిస్తూ వారి నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగారం శంకర్, కౌన్సిలర్లు జాలిగం విఘ్నేష్, పోలిశెట్టి అనిల్, బొంతల నర్సింహా, నాయకులు జాలిగం శివ, బట్టు సందీప్, కొత్త జానీ, శివ, నరేష్ పాల్గొన్నారు.

## 25న జాబ్ మేళా

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 23 :** ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 25న శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ హ్యుందాయ్, వరుణ్ మోటార్స్, అపోలో ఫార్మసీ సంస్థలు వివిధ విభాగాల్లో అభ్యర్థులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7036902902, 8247656356 నంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

## ఎక్సైజ్ దాడులలో ఆరుగురు అరెస్ట్

**ముద్ర, కొండమల్లేపల్లి:** దేవరకొండ మండలంలో హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్, నల్గొండ ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఇద్దంపల్లి, పూసలారం తరోడా, మేగ్య, లచ్యతండా, పాత్లావత్ తాండాల్లో దాడులు చేసి నాటుసారా తయారీకి వినియోగించే పట్టిక, నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎసాచ్వో శ్రీనివాస్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 24.07.2026
www.mudranews.in | @mudranews



**ఉసిరితో సమతుల్య జీవనశైలితోనే పూర్తి ప్రయోజనం**

ఉసిరికాయతో పాటు సమతుల్య ఆహారం, రోజువారీ వ్యాయామం, తగిన నిద్ర పాటిస్తే భోజనం తర్వాత షుగర్ లెవెల్స్‌ను నియంత్రించడంలో మరింత మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది.



# మోదీ హటావో దేశ్ బచావో

**రాహుల్ గాంధీ గారిని అక్రమంగా అరెస్టు చేయడం అమానుషం   సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**
నీట్ లీకేజీ వ్యవహారంపై శాంతియుహంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అమానుషం అని మోదీ హటావో దేశ్ బచావో మా నినాదం అని సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరి కృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ విమర్శించ్చారు. అత్తు ఇమమ్ ఆధ్వర్యంలో సిద్ధిపేట లోని బిజెపి కార్యాలయం ముట్టడికి యత్నించారు. ముట్టడికి వెళ్తున్న సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులని కార్య కర్తలను పోలీసును అడ్డుకుని వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులపై లాఠీచార్జి చేయించడం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అక్రమంగా అరెస్టుచేయడం అప్రజాస్వామికం అన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ చర్యలు మోదీ నిరంకుశత్వానికి నియంతృత్వ ధోరణికి పరాకాష్ట అని మండిపడ్డారు. నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని నీట్ లీకేజీతో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థులకు వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించాలి అని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై మోదీ ఇంత వరకు ఎందుకు నోరు మెదపడం లేదు అని ప్రశ్నించారు. అధికారం ఉండి అని పోలీసుల చేత విద్యార్థులపై ప్రశ్నిస్తున్న విపక్ష నేతలపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం అని అన్నారు. నీట్ లీకేజీ ఘటనకు బాధ్యతలను వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి అని అన్నారు. దేశాన్ని కాపాడాల్సిన ప్రధాని మోదీ అండతోనే బిజెపి నాయకులు వీధి రౌడీల్లా రెచ్చిపోతున్నారు అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో విద్యార్థులకు సంబంధించిన 152 రకాల పరీక్ష పత్రాలు లీకేజీ జరిగింది వాస్తవం కాదా అని అన్నారు. విద్యార్థులు విపక్ష నేతలపై అమానుషంగా ప్రవర్తించిన నరేంద్ర మోదీ విద్యార్థులకు విపక్ష నేతలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి అని అన్నారు. దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోయింది అని వచ్చే ఎన్నికల్లో బిజెపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను తెలిపారు.నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీశాయని ఆయన అన్నారు. ఈ ఘటనల కారణంగా పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారులక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఢిల్లీలో జరిగిన విద్యార్థులపై దాడులపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. అలాగే ఎన్‌టీఏను రద్దు చేయాలని, వీబీఎస్‌ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుజూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన




పిలుపును విజయవంతం చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌కు మద్దతు తెలపాలని బత్తుల అభిషేక్ భాను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చెపియాల సంతోష్ నాయకులు సంజయ్ మరియు విజయ్ నవదీప్రుతిన్ రిషి కిరణ్ వంశీ లక్ష్మణ్ సాయి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

*** తాగు నీటి సరఫరాపై ఎల్‌నినో ప్రభావం పడకుండా చూడాలి**
*** నీటి వనరులను అనుసంధానం చేయాలి....**
*** నిర్దేశిత సమయంలో ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేయాలి**
*** వాటర్‌బోర్డు సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగు నీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని సీఎం సూచించారు. హైదరాబాద్ మహా నగర తాగు నీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీహెచ్ఆర్డీలో గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానించాలని సీఎం సూచించారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగు నీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు సీఎం తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై సీఎం ఆరా తీశారు. ఎస్టీపీల నిర్మాణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని సీఎం ఆదేశించారు. తాగు నీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో ఎంఏ యూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ పాల్గొన్నారు.

## ఓయూ, జేఎన్‌టీయూ సహా పలు వర్సిటీల పరిధిలో పరీక్షలు వాయిదా

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 24న (రేపు) విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వ విద్యాలయం (టీయూ), శాతవాహన వర్సిటీల పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా విశ్వ విద్యాలయాలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని.. త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్ టీయూ, టీయూ, శాతవాహన వర్సిటీలు తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు 24న బంద్‌కు పిలుపునిచ్చాయి.



## విద్యార్థుల యూనిఫాంల నాణ్యతపై రాజీ లేదు: సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో విద్యార్థుల యూనిఫాంల సరఫరా, పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఆగస్టు 15లోగా ప్రతి విద్యార్థికి యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యూనిఫాంల నాణ్యతపై ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో జూన్ 2 నాటికే విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో యూనిఫాంల పంపిణీ అస్తవ్యస్తంగా జరిగిందని పేర్కొన్న సీఎం, పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## 142 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 142 సెల్‌ఫోన్లను కేవలం 22 రోజుల్లో రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల మొత్తం విలువ రూ.21,84,800 ఉంటుందని పేర్కొన్నారు. తమ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేసి ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మెదక్ జిల్లా పోలీసులు 4,038 సెల్‌ఫోన్లను రికవరీ చేసి, కమిషనరేట్లను మినహాయిస్తే రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచినట్లు ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు జార్జ్, రాజశేఖర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, మహేందర్, వెంకట్ గౌడ్, జిల్లాలోని సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేతో సమస్యలు పరిష్కారం

**కలెక్టర్ ప్రతిమాసింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** భూముల రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. గురువారం మెదక్ మండలం కొంటూరులో భూముల రీ సర్వే గ్రామసభలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రైతులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఏళ్ల తరబడి మోకాపై సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుందని, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చేపడతామని, నిజమైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ## వసతి గృహాలలో పరిశుభ్రం, ఆరోగ్యం ఉండాలి...వసతి గృహాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతిరోజూ శుభ్రత చర్యలుచేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. చిన్నశంకరంపేటలో షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మింగా తనిఖీ చేశారు. హాస్టల్లోని వంటగది,స్టోర్ రూం, ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతరవసతులను పరిశీలించారు. హాస్టల్విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంట వార్డెన తులసీరామ్, ఎంపీడీవో దామోదర్, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## రేపు విద్యాసంస్థలు బంద్!

**ముద్ర, హైదరాబాద్ :** ఈ నెల 24న(శుక్రవారం) రాష్ట్రంలోని విద్యాసంస్థలన్నీ బంద్ చేసి విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది.ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్‌యూఐ,పీడీఎస్‌యూ,ఏఐఎఫ్‌డీఎస్ సంఘాలు ఉద్యమ కార్యాచరణ ప్రారంభించాయి.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, NTAను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలో లాఠీఛార్జ్ చేసిన వారిపై చర్యలకు డిమాండ్ చేశారు.విద్యార్థులపై పెట్టిన కేసులు కూడా వెనక్కి తీసుకోవాలని కోరారు.

## ఆరు హత్యల ఘటన.. షాబాద్ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు

**ముద్ర, హైదరాబాద్** : షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డిపై బదిలీ వేటు పడింది. హైదరాబాద్ నగరం సమీపంలోని షాబాద్ ఠాణా పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఆరు హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పోక్సో కేసు పెట్టిందన్న కారణంతో ఓ బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు.. తనతో గొడవపడుతోందనే కారణంతో భార్య, ఇద్దరు పిల్లలు.. మొత్తం ఆరుగురిని నిందితుడు రాజ్‌కుమార్ దారుణంగా హత్య చేశాడు. అనంతరం నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి ఆరు హత్యలు చోటుచేసుకున్నాయి. 11వ తేదీన.. ఈ విషయంలో షాబాద్ పోలీసుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్‌జోషి విచారణ జరిపి ఎస్ఐ రమేశ్‌ను సస్పెండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డికి ఛార్జ్ మెమో ఇచ్చారు. 13 రోజుల తర్వాత ఇప్పుడు ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న లక్ష్మారెడ్డిని నియమించారు. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డిని చేవెళ్లకు బదిలీ చేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్‌ను సీసీఆర్‌బీకి మార్చారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555